క్లుప్తంగా

మీ సేవ కేంద్రం ప్రారంభం



మీ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దానయ్య

దుద్యాల్: మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన మీ సేవ కేంద్రాన్ని తహసీల్దార్ దానయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. మండలంలో ముందుగా ఒక మీ సేవ కేంద్రం ఉందని, దానికి తోడుగా మరొక మీ సేవ కేంద్రాన్ని అందుబాటులోకి తేవడంతో సేవలు మరింత సులభతరం కానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు కృష్ణ, ఏఈఓ మొహినోద్దీన్, మాజీ సర్పంచ్ ఖాజా, గ్రామస్తులు పిట్ల మొగులయ్య, సత్యం, ఎల్లప్ప, సంజీవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల కార్యాలయ సముదాయం ఎదుట బుధవారం మీసేవ కేంద్రాన్ని ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ శాఖల పనులు ఆన్‌లైన్ విధానంలో మీసేవ కేంద్రాల్లో చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలుగౌడ్ పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు మీసేవ నుంచి అంతరాయం లేకుండా, ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకష్ణ, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బేగరి రాములు, మండల నాయకులు రాంచంద్రారెడ్డి, కిష్టప్ప, నర్సింలునాయుడు, మల్లేశ్, సంగాయిపల్లి నర్సిములు, సూర్యప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం ఎస్ఐగా మహిపాల్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

బంట్వారం: సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన మహిపాల్‌రెడ్డి బుధవారం బంట్వారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ శ్రీశైలం కొంత కాలంగా లాంగ్ లీవ్ పెట్టడంతో ఏఎస్ఐ నజీర్ అహ్మద్‌బేగ్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ క్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు మహిపాల్‌రెడ్డిని బంట్వారానికి నియమించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడారు. మండల ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలన్నారు.

మొక్కలతో మానవ మనుగడ

ఎంపీడీఓ వినయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీఓ వినయ్‌కుమార్

అనంతగిరి: మొక్కలతో మానవ మనుగడ ఉంటుందని ఎంపీడీఓ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏ, ఈసీ, ఎఫ్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను పరిరక్షించాలన్నారు. ఇంటింటికీ పంచిన మొక్కలను ప్రతిఒక్కరూ తమతమ ఇండ్లలోని ఖాళీప్రదేశాల్లో నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శీను, ఎంపీఓ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరణ



రఫియాఖానంను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారాం బదిలీ కావడంతో కళాశాలలో సీనియర్ ఫ్యాకల్టీ రఫియాఖానం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు నూతనంగా విధుల్లో చేరిన ప్రిన్సిపల్ రఫియాఖానంనకు పుష్పగుచ్ఛాలు అందిస్తూ అభినందనలు తెలిపారు.

తప్పని తిప్పలు..!

- ఎరువుల కోసం బారులు తీరిన రైతులు
- నేటికి పూర్తి స్థాయిలో అందక ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



రైతు సేవా సహకార సంఘం ఎదుట ఎరువుల కోసం బారులు తీరిన అన్నదాతలు

పెద్దేముల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా నేటికి రైతన్నలకు ఎరువుల కోసం తిప్పలు తప్పడం లేదు. పూర్తి స్థాయిలో ఎరువులు అందక రైతన్నలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఎదుట ఎరువుల కోసం బారులు తీరారు. ఉదయం ఏడు గంటల నుంచి 10గంటల వరకూ నిల్చుంటే మూడు బస్తాలు పంపిణీ చేశారని వాపోతున్నారు. ప్రతి ఏటా ఎరువుల సమస్య ఉత్ప న్నమవుతున్నా, మార్కెట్లో అధిక ధరలకు అమ్ము కుంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలే దు. సుమారు మూడేళ్ల నుంచి ఇష్టం వచ్చిన ధరల కు విక్రయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్క రూపాయి కూడా అధిక ధరకు విక్రయాలు చేయొ ద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా దుకణాదారులు ఎరువులు, విత్తనాలను ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని చెబుతున్నారు. పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేస్తున్నప్పటికీ అవీ సక్రమంగా అందుబాటులోకి రావడం లేదని చెబుతున్నారు. ఖరీఫ్‌కు ముందు ఎరువులు, విత్తనాల కొరత లేనప్పటికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు చేపట్టడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు గొప్పలు చెప్పడం తప్ప సమస్యలు పరిష్కరించేవారు లేరని మండిపడుతున్నారు. ప్రస్తు తం కురుస్తున్న వర్షాలకు పత్తి, కంది, వరితో పాటు చెరకు పంటలకు యూరియా అవసరం ఉంటుంది. కనీసం ఎకరాకు సుమారు మూడు సంచుల నుంచి నాలుగు బస్తాల వరకు అవసరం ఉంటుంది. ప్రతి ఏటా ఎరువుల కోసం నానా ఇబ్బందులు పడుతు న్నా ప్రభుత్వాలు ఎందుకు సమస్య పరిష్కరించడం లేదని మండలంలోని పెద్దేముల్, మారేపల్లి, గాజీ పూర్, మంబాపూర్, బుద్దారం, జనగాం పలు గ్రామాల రైతులు పేర్కొన్నారు.

అధిక ధరలకు విక్రయాలు

వ్యవసాయ అధికారులు దుకాణాల వద్దకు వెళ్లి తనిఖీలు చేయడం, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించడం తప్ప ఎరువులు ఏ ధరకు విక్రయాలు చేస్తున్నారని ఎందుకు ప్రశ్నించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్లో 45 కిలోల యూరియా బస్తా రూ.270, డీఏపీరూ.1,350 విక్రయాలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా దుకాణాల యజమానులు యూరియా రూ.320 నుంచి రూ.330లకు, డీఏపీ 1,450 వరకూ విక్రయాలు చేస్తున్నారు.

ఎకరాకు 5 సంచులు ఇవ్వాలి



ఎకరాకు ఐదు సంచులు యూరియా ఇవ్వాలి. మూడు సంచులు ఇస్తే సరిపోవడం లేదు. మార్కెట్లో 45కిలోల బస్తా యూరియాకు రూ.40 నుంచి రూ.50వరకు దండుకుంటున్నారు. ఈ విషయంలో ప్రశ్నిస్తే ఎరువులు అమ్మడం లేదు. ప్రభుత్వం రైతులకు అవసరం ఉన్నంత మేర ఎరువులు పంపిణీ చేయాలి.

– ఆజం, రైతు, పెద్దేముల్

ప్రతీ రైతుకు అందేలా చర్యలు తీసుకుంటాం



పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం ద్వారా ఇప్పటి వరకూ 150 టన్నుల యూరియా పంపిణీ చేశాం. త్వరలో యూరియాతో పాటు పొటాష్ రాబోతుంది. ప్రతి రైతుకు ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటాం. పట్టా పాసుబుక్‌కు 3నుంచి నాలుగు సంచుల చొప్పున అందచేస్తున్నాం. అయినప్పటికీ రైతులు చాలడం లేదని మొర పెట్టుకుంటున్నారు.

– మురళీగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ మేనేజర్, పెద్దేముల్

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

- చదువుకోనమే తల్లిదండ్రులు పిల్లలను హాస్టల్‌లో ఉంచారు
- మెనూ ప్రకారం భోజనం అందించాలి
- అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు: వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్‌తో పాటు నియోజకవర్గ అధికారులు, వసతిగృహ వార్డెన్‌తో అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. పేదరికం వల్లే తల్లిదండ్రులు వారి పిల్లలను వసతిగృహాల్లో చేర్పించి పిల్లలకు దూరంగా ఉంటున్నారన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే బాధ్యత హాస్టల్ వార్డెన్‌లపై ఉందని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. రెండేళ్లుగా వసతి గృహ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పరిశీలించగా ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించకపోవడంతో ఎమ్మెల్యే వార్డెన్లపై అసహనం వ్యక్తం చేశారు. వసతి గృహాల్లోని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పెరిగేలా బోధన చేయాలని ఆదేశించారు. అవసరమైతే విద్యార్థులకు హాస్టల్‌లో ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. ఇటీవలి కాలంలో పలు హాస్టల్‌లలో విద్యార్థులు అనారోగ్యానికి గురైన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పిల్లల ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటించకపోతే వార్డెన్‌లతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వసతి గృహ గదులను ప్రతి రోజు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల తడి బట్టలను ఆరేసుకునేందుకు ప్రత్యేక గదిని అందుబాటులోకి తీసుకరావాలన్నారు. వసతి గృహాల నిర్వహణ బాధ్యతలను వాచ్‌మెన్‌లపై వదిలిపెడితే వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి కాబట్టి అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు గదులను తనిఖీ చేయాలన్నారు. రాత్రి సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, తాండూరు, పెద్దేముల్ మండలాల తహసీల్దార్‌లు ధారాసింగ్, కిషన్‌నాయక్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, పెద్దేముల్ ఎంపీడీఓ జర్నప్పతో పాటు హాస్టల్ వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేద్దాం



హర్ ఘర్ తిరంగాలో కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు

అనంతగిరి: ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దామని కౌన్సిలర్ శ్రీదేవి సదానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్‌లోని 24వ వార్డులో హర్ ఘర్ తిరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సదానందరెడ్డి, డాక్టర్ సృజన్, డాక్టర్ గిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ రాక

వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో గురువారం నిర్వహించనున్న జెండా వందనానికి శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం 10గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు.

పాఠశాలలు, కార్యాలయాలు ముస్తాబు

నేడే జెండా పండుగ

కొడంగల్ రూరల్: మండలంలోని పాఠశాలలు, కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను జెండా వందనం కోసం బుధవారం సిబ్బంది ముస్తాబు చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది ముగ్గులు వేస్తూ రంగు రంగుల కాగితాలతో అలంకరించారు.

తాండూరులో..

తాండూరు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు తాండూరు పట్టణం ముస్తాబు అయింది. బుధవారం మున్సిపల్ పాలక వర్గం తాండూరు పట్టణంలో త్రివర్ణ రంగులతో కూడిన విద్యుత్ దీపాలను మొదటిసారిగా అలంకరించారు. తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట 100 అడుగులు (30 మీటర్ల) ఎత్తు కలిగిన భారీ త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 8.25 గంటలకు భారీ త్రివర్ణపతకాన్ని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. మరోవైపు తాండూరు నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంఘాలు, యువజన సంఘాలు, స్వాత్రంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ కాంతులతో అలంకరించిన మున్సిపల్ కార్యాలయం

కార్యదర్శులకు సన్మానం

మోమిన్‌పేట: ప్రతీ ఉద్యోగి చేసిన సేవలే ఎల్లప్పుడు గుర్తుండిపోతాయని మాజీ సర్పంచ్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి ఇటీవల బదిలీపై వెళ్లగా, నూతనంగా వచ్చిన కార్యదర్శి రాణిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారో వాటిని గుర్తుంచుకునేలా విధులు నిర్వర్తించాలన్నారు. బదిలీపై వెళ్లిన, నూతనంగా ఇక్కడికి వచ్చిన కార్యదర్శులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాణయ్య యాదవ్, వెంకటయ్య, పాండురంగారెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శులను సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

డీఎస్పీని కలిసిన నవాబుపేట ఎస్ఐ

నవాబుపేట: ఇటీవల నవాబుపేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ బుధవారం వికారాబాద్ డీఎస్పీ నర్సిహ్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

మురుగు.. పరుగు!

- చెత్త చెదారంతో నిండిన మార్కెట్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



మార్కెట్ యార్డులో చేరిన మురుగు

పరిగి: మురుగు, చెత్తా చెదారంతో మార్కెట్ యార్డు నిండిపోయింది. ప్రతీ శుక్రవారం, శనివారాల్లో అక్కడ సంత నిర్వహిస్తారు. ప్రతీ రోజు మార్కెట్ యార్డులో కూరగాయల విక్రయాలు ఉంటాయి. దీంతో కూరగాయల చెత్త చెదారం అక్కడే పారబోయడంతో మార్కెట్ యార్డులో మురుగుతో చెత్తచేరి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షం పడితే అంతే.. మార్కెట్ యార్డులో నీరు చేరి మురుగు తయారువుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులోకి వాహనాలపై రైతులు వస్తే మురుగునీటిలో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డులో పేరుకపోయిన చెత్త చెదారాన్ని, మురుగు నీటిని శుభ్రం చేయించాలని రైతులు అధికారులకు ఎంత చెప్పినా ఎవరూ పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మార్కెట్ యార్డును పరిశుభ్రంగా ఉంచాలని పలువురు రైతులు కోరారు.

ఉపాధ్యాయుల నిరసన



బంట్వారం మోడల్ స్కూల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బంట్వారం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బంట్వారం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూళ్ల ప్రారంభమై 11 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ తమకు బదిలీలు లేవన్నారు. దీంతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వేతనాలు అందక ఆర్థిక సమస్యలతో సతమతమౌతున్నామని పేర్కొన్నారు. 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. 317 జీఓను అమలు చేసి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య, జిల్లా అధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, కులకర్ణి, గోపాల కృష్ణ, సంతోష, దీపక్, అన్నపూర్ణ, స్వప్న, కల్పన, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ వృశాలి



మాట్లాడుతున్న వృశాలి

మర్పల్లి: యూనియన్ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్విని యోగం చేసుకోవాలని ఫీల్డ్ అధికారి వృశాలి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపాజిట్లపై ఇస్తున్న వడ్డీ రేట్లపై అవగాహన కల్పించారు. 333 రోజులు ఫిక్సుడు డిపాజిట్లు చేసుకునే సూపర్ సీనియర్ సిటీజన్స్‌కు 8.15 శాతం, సీనియర్ సిటీజన్స్‌కు 7.90 శాతం, ఇతరులకు 7.40 శాతం వడ్డీతో డిపాజిట్ డబ్బులు వాపస్ ఇస్తారన్నారు. ఖాతాదారులకోసం యూనియన్ బ్యాంకు పలు బీమా పథకాలు అమలు చేస్తుందన్నారు. సురక్ష బీమా పథకం కోసం 18 సంవత్సరాల పైబడి 70 సంవత్సరాల లోపు అర్హులు. వారు సంవత్సరానికి రూ. 20 కడితే బీమా వర్తిస్తుందన్నారు. పీఎంజేజేబీవై పథకం కింద 18 సంవత్సరాల పైబడి 50 సంవత్సరాల లోపు కలిగిన ఖాతాదారులు సంవత్సరానికి రూ. 440 చెల్లిస్తే సాధారణ బీమాకు అర్హులన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు, మహిళ సంఘాల సభ్యులకు కేర్ ఇన్సూరెన్స్ పథకం కింద సంవత్సరానికి రూ. 1,499 చెల్లిస్తే ప్రమాదవశాత్తు లేదా సాధారణ మరణం పొందితే నామినీకి రూ. 5లక్షలు యూనియన్ బ్యాంకు అందజేస్తుందన్నారు. ఇవే కాకుండా మరెన్నో పథకాలను యూనియన్ బ్యాంకు అమలు చేస్తుందని, వాటిని ఖాతాదారులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణ బదిలీ కావడంతో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆయనను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధికి కృష్ణ ఎంతో కృషి చేశాడని గుర్తుచేశారు. ఆయన సేవలు ఎప్పుడు మరిచిపోలేనివన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పలరాజు, గ్రామస్తులు నర్సింలు, జగన్‌మోహన్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్
- ఫోన్ ఇన్ ఫిర్యాదులపై కమిషనర్ దృష్టి



దంపింగ్ యార్డు వద్ద చెత్త తొలగింపజేస్తున్న కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: దశల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌కు ప్రాంత ప్రజలు పలు సమస్యలను విన్నవించిన విషయం విధితమే. అనంతరం సమస్యల పరిష్కారానికి ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపాలిటీలోని 1,9వ వార్డుల్లో వీధికుక్కలను బ్లూ క్రాస్ వారికి పట్టించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద చెత్తను రోడ్డుపై వేయడంతో ఇబ్బందులు తలెత్తినట్లు ఫిర్యాదు రాగా.. జేసీబీ సాయంతో చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తరలించారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఆనంద్, సిబ్బంది అమర్‌నాథ్, హరిదాసు తదితరులు ఉన్నారు.